

## క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ, చెన్నూరు నియోజకవర్గాలను

# అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

✦ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి

**జైపూర్, ఏప్రిల్ 04, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ, చెన్నూరు నియోజకవర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని భూగర్భ, గనుల శాఖ, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. శనివారం జరిగిన క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికపై ఆయన స్పందించారు. బాల్క సుమన్ చెన్నూరులో హింసను ప్రోత్సహిస్తే ఊరుకునేది లేదని, అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సుమన్ వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు లేదని,అందుకే చెన్నూరు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు.గత ఎన్నికల్లో బట్టలిప్పి కొడతానని వ్యాఖ్యలు చేసినందుకే చెన్నూరు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని ఏద్దేవా చేశారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలకు కట్టుబడి ఉన్నామనేదానికి నిదర్శనమే ఈ క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికలని అన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకే ముందు నుండి సహకరించామని, బాల్క సుమన్ బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీని బదనాం చేసేందుకు ప్రయత్నించారని అన్నారు. కాన్వాయ్ పై దాడి చేసి, అల్లర్లు సృష్టించినందుకే పోలీసులు కేసులు నమోదు చేశారని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చెన్నూరు నియోజకవర్గంలో ఈసారి ఎన్నికలు జరిగాయని, గతంలో టిఆర్ఎస్ హయాంలో బెదిరించి ఏకగ్రీవాలు చేసి ఎన్నికలు జరగకుండా అడ్డుకున్నా చరిత్ర బాల్క సుమన్ సొంతమని అన్నారు. బాల్క సుమన్‌లా బెదిరింపు, రౌడీ రాజకీయాలు మేము చేయలేదని చేయబోమని,అలా చేస్తే ప్రజాస్వామ్యానికి అర్థం ఉండదని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.


# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 5, ఏప్రిల్ 2026




## క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై

# గులాబీ, ఎర్రజెండాల రెపరెప...

* ప్రజాతీర్పును శిరసా వహించిన బి.ఆర్.ఎస్ సీ.పి.ఐ కౌన్సిలర్‌లు
* ఎన్ని బెదిరింపులు, కోట్ల ప్రలోభాలకు లొంగని బి.ఆర్.ఎస్ అండ్ సీ.పి.ఐ కౌన్సిలర్‌లకు అభినందనలు..

**మంచిర్యాల/క్యాతన్ పల్లి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపిన క్యాతన్ పల్లి మున్సిపల్ పీఠం ఎట్టకేలకు బీఆర్ఎస్ సీ.పి.ల కూటమి కైవసం చేసుకోవడంతో సుమారు 50 రోజుల నిరీక్షణకు తెర పడింది.శనివారం అడిషనల్ కలెక్టర్ ఎన్నికల ప్రత్యేక అధికారిగా, ఎలక్షన్ పరిశీలకులుగా బెల్లం పల్లి సబ్ కలెక్టర్ వ్యవహరించగా క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పై గులాబీ, ఎర్ర జెండ ఎగిరింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్యాతన్‌పల్లిలోని ఆయన నివాసంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యం,పోలీసులు అతుత్సాహం ప్రదర్శించినప్పటికీ న్యాయమే గెలిచిందని అన్నారు.కాంగ్రెస్ నాయకుల దురహంకారానికి మిగతా 2లో..

# పారదర్శకంగా ఆన్లైన్ బుకింగ్ ద్వారా ఇసుక సరఫరా

★ కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :**



మన ఇసుక వాహనం పోర్టల్ ద్వారా పూర్తి పారదర్శకంగా ఆన్లైన్ బుకింగ్ ద్వారా ఇసుకను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వారిచే మన ఇసుక ఆన్లైన్ బుకింగ్ వెబ్ పోర్టల్ పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, భూగర్భగనుల శాఖ సంచాలకులు గంగాధర్ రావుతో, కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా జరగకుండా ఏప్రిల్ 1 నుండి ఆన్లైన్ బుకింగ్ ద్వారా మాత్రమే ఇసుకను అందించాలని, ఇందులో భాగంగా తహసిల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు మన ఇసుక వాహనం పోర్టర్లో పొందుపరిచిన విధులు, బాధ్యతల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక రవాణా పై లబ్ధిదారులకు మన ఇసుక వాహనం పోర్టల్‌పై వివరించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలలో వేసవి త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చేతి పంపులు, బోర్ వెల్స్,

# అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠినంగా వ్యవహరించాలి

✤ తిర్యాని పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ ✤ జిల్లా ఎస్పీ నితికా పంత్

**తిర్యాని, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**




అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠినంగా వ్యవహరించాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ పేర్కొన్నారు. శనివారం ఎస్పీ తిర్యాని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత తదితర విభాగాలను పరిశీలించారు. ఎస్‌హెచ్ఓ వెంకటేష్‌కు, స్టేషన్ సిబ్బందికి, ఎస్పీ పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బందీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు, గ్రామాల్లో చట్టవ్యతిరేకచర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. మండల కేంద్రంలో, గ్రామాల్లో ప్రజలు వ్యాపారస్తులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని అన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదిదారుడితో, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, శాంతి భద్రతల విషయంలో రాత్రిపూట పర్యవేక్షణ, పెట్రోలింగ్‌ను కచ్చితంగా కొనసాగించాలని సూచించారు. ప్రజాభద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# పారదర్శకంగా ఆన్లైన్ బుకింగ్ ద్వారా ఇసుక సరఫరా

(మొదటిపేజీ తరువాయి)

పైప్ లైన్లను మరమ్మత్తులు చేపట్టి త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామపంచాయతీలలో పారిశుద్ధం ప్రతిరోజు చేపట్టాలని, వీధిలైట్లు పగటి పూట వెలుగుతున్నాయని వాటికి నియంత్రికలు అమర్చాలన్నారు. ఏప్రిల్ నెలలో నిర్వహిస్తున్న జనగణలో భాగంగా ఏన్యుమరేటర్లు ఇళ్ళ జాబితాను రూపొందిస్తున్నారని, వారికి పంచాయతీ కార్యదర్శులు సహకరించాలన్నారు. భూభారతి ధరఖాస్తులు పెండింగ్ లో లేకుండా తహసిల్దార్ లు దృష్టి సారించాలన్నారు. పిడిఎస్ బియ్యం మూడు నెలలవి ఒకేసారి పంపిణీ చేస్తున్నందున రద్దీ లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమములో తహసిల్దార్లు, పంచాయతి కార్యదర్శులు, గ్రామ పాలనాధికారులు, సంబందిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై గులాబీ, ఎర్రజెండాల రెపరెప...

(మొదటిపేజీ తరువాయి)

క్యాతన్ పల్లి ప్రజానీకం ఇచ్చిన ప్రజాతీర్పు చెంపపెట్టని అన్నారు.ప్రజలు నిర్ణయించి గెలిపించిన 14 మంది కౌన్సిలర్లు 51 రోజుల పాటు వారి కుటుంబాలకు దూరంగా ఉండటం జరిగిందని తెలిపారు.క్యాతన్ పల్లి మున్సిపల్ కార్యాలయం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఫిబ్రవరి 17న జరిగిన సిసి ఫుటేజ్ బయట పెట్టాలని సుమన్ డిమాండ్ చేశారు.పోలీస్,రెవెన్యూ యంత్రాంగం కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాస్తూ తమపై తమ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి 16 రోజుల పాటు ఆదిలాబాద్ జైల్లో పెట్టడం జరిగిందని చెప్పుకొచ్చారు.తమ కౌన్సిలర్లను మానసికంగా బయపట్టించేందుకు వారి కుటుంబ సభ్యుల మీద అక్రమ కేసులు పెడతామని,అలాగే 11 వార్డు లో గెలిచిన బొమ్మ భూమయ్య గౌడ్ ని ఎదుర్కొనే ధైర్యం లేక స్థానిక కాంగ్రెస్ నాయకులు సింగరేణి ఎస్ అండ్ పీసీ అధికారులతో కలిసి భూమయ్య కుటుంబ సభ్యులను భయబ్రాంతులకు గురిచేసిన సందర్భాలు కూడా ఉన్నాయని అన్నారు.సింగరేణి అధికారులు కాంగ్రెస్ నాయకులతో కిలిసి ఇలాంటి దౌర్జనానికి పాల్పడవద్దదని ప్రొడక్షన్ పై దృష్టి సారించాలని హితవు పలికారు.కో అప్షన్ సీట్ల పంపిణిలో తాము పొత్తు ధర్మానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు.అలాగే మున్సిపాలిటీకి సంబందించి బి.ఆర్.ఎస్, సీ.పి.ఐ పార్టీ ల నాయకులతో నలుగురు సభ్యుల తో కూడిన సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు.మంత్రికి ఐ లవ్ యూ చెప్పిన బాక్యాతన పల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్న సందర్భంగా మంత్రి వివేక్ కు బాల్క సుమన్ ఐ లవ్ యూ చెప్పడం జరిగింది.కార్మిక శాఖ మంత్రి గా ఉన్న తమరు క్యాతనపల్లి మున్సిపాలిటీకి రాష్ట్రప్రభుత్వం నుండి నిధులు తీసుకురావాలని కోరారు.మున్సిపాలిటీ ప్రజలకు ఇప్పటికీ రెండు వేల పై చిలుకు పట్టాలు ఇవ్వవలసి ఉందని ఈ రెండేళ్ల కాలంలో ఒక్క పట్టా కూడా పంచలేదని దుయ్యబట్టారు.సింగరేణి కార్మికుల మెడికల్ బోర్డు ఆపివేయడం పై మండిపడ్డారు.తమ ప్రభుత్వం లో3వేల మంది కార్మికులకు మెడికల్ బోర్డు ద్వారా కారుణ్య నియామక ఉద్యోగుల ఇప్పించమని అన్నారు.కార్మిక శాఖ మంత్రి ఒకసారి ఆత్మ పరిశీలన చేరుకోవాలని కోరారు.త్వరలో సింగరేణి కార్మికుల సమస్యలపై బీఆర్ఎస్,సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాల బాటలో ముందుకు వెళ్తామని సుమన్ అన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్,ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి,మాజీ దివాకర్ రావు,రవీందర్ సింగ్,ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేని శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామడుగు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :**

షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతీ యువకులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆసిఫాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 వరకు రుణాలను ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీయని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్సి నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

# సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పర్యటించిన సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్

**జైపూర్,ఏప్రిల్ 04,ప్రభాతవార్త**



సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ శనివారం జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పర్యటించారు.ఎగ్జ్ క్యూటివ్ డైరెక్టర్ చిరంజీవి,జనరల్ మేనేజర్ నరసింహారావు, కిరణ్ రాజ్ కుమార్‌కు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎస్టీపిపిలోని డిస్పెన్సరిని సందర్శించి, డిస్పెన్సరిలో రోగులకు అందిస్తున్న వైద్య విధానాలు, వైద్య సదుపాయాలు గురించి అక్కడి డాక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎస్టీపిపి డిస్పెన్సరిలో రోగులకు క్యాజువాలిటి లేదని, దానిని త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ఎస్టీపిపిలోని సింగరేణి ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు నిర్ణిత సమయానికి చేసే పీరియాడికల్ మెడికల్ ఎగ్జామినేషన్ (పి.ఎం.ఈ/ఐ.ఎం.ఈ) వంటి వైద్య పరిక్షలకు ఇతర ఏరియా హాస్పిటల్స్ కు వెళ్ళకుండా ఎస్.టి.పి.పి డిస్పెన్సరీ లో అన్ని వైద్య పరిక్షలు నిర్వహించేలా చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం సర్వీస్ బిల్డింగ్ లో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎం (పిసిఎస్) అండ్ (ఓ అండ్ ఎం) జి.ఎం. మదన్ మోహన్,పర్సనల్ డీ.జి.ఎం కిరణ్ బాబు,డిప్యూటీ సి.ఎం.ఓ రమేష్ బాబు, మెడికల్ సూపరింటెండెంట్ డా. జానకి, ఎస్వోటూ ఈడి వెంకటయ్య, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో బీజేపీ ప్రశిక్షణ మహా అభియాన్ శిబిరం విజయవంతం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 04, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 కార్యక్రమం భాగంగా నాలుగు మండలాలకు సంబంధించిన శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో బెల్లంపల్లి పట్టణం, బెల్లంపల్లి మండలం, కాసిపేట మండలం, తాండూరు మండలాలకు చెందిన పార్టీ కార్యకర్తలుపాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా ఇంచార్జి కన్నెబోయిన ఓదెలు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, పరమపూజ్య మోహన్ భగవత్ సూచించిన పంచ పరివర్తన అంశాలను కార్యకర్తలకు సవివరంగా వివరించారు. సమాజంలో వ్యక్తిగత జీవనశైలి, దేశ పౌరులుగా మన బాధ్యతలు, కుటుంబ వ్యవస్థలో పాత్ర, సమాజ సేవలో కార్యకర్తల బాధ్యతలపై స్పష్టత ఇవ్వడం జరిగింది. కార్యకర్తలు సమాజ మార్పుకు ముందుండి పనిచేయాలని, ప్రజలతో మమేకమై సేవాభావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిక్షణ శిబిరంలో మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, కొయ్యల హేమాజీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు క్రిష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకటకృష్ణ, జిల్లా కార్యదర్శులు రాచర్ల సంతోష్, వైద్య శ్రీధర్ పాల్గొన్నారు. అదేవిధంగా మండల అధ్యక్షులు ధార కళ్యాణి, గజ్జెల్లి రాజ్‌కుమార్, సూరం సంపత్, భరత్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

# విజ్ఞానోత్సవంగా ఓపెన్ డే

**భైంసా, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**



భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఓపెన్ డే కార్యక్రమం విద్యార్థులకు విజ్ఞానోత్సవంగా నిలిచింది. ఈ ప్రదర్శనలో అన్ని విభాగాలు తమ సబ్జెక్టులకు సంబంధించిన అంశాలను నమూనాలు, ప్రయోగాల ద్వారా వివరించాయి. కామర్స్ విభాగం పురాతన నాణేలు, బ్యాంకింగ్ విధానాలపై అవగాహన కల్పించగా, రసాయన శాస్త్ర విభాగం పలు శాస్త్రీయ ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి చూపింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయని తెలిపారు. డాక్టర్ రవికుమార్, డాక్టర్ నహీదా తపస్సుం ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ నిర్వహించి భవిష్యత్తు లక్ష్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన శ్రీహరిరావు

**సారంగాపూర్, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన సుంకరి లస్మవ్వకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును కాంగ్రెస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కూచాడి శ్రీహరిరావు శనివారం అందజేశారు. అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన బాధితులకు ప్రభుత్వం అందించే ఈ సహాయం ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, నాయకులు సుభాష్ రెడ్డి, గుర్రాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మండల ప్రత్యేక అధికారి బాలిక్ హైమద్

## అలూరులో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

**సారంగాపూర్, మార్చి 04, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని అలూరు గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇంటిని శనివారం మండల ప్రత్యేక అధికారి బాలిక్ హైమద్, డివిజనల్ పంచాయతీ అధికారి లింగయ్య ప్రారంభించారు. లబ్ధిదారుడి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన అధికారులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ పథకం లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఇల్లు లేని తమకు ప్రభుత్వం పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, హౌసింగ్ ఏఈ నాగార్జున, అలూరు సర్పంచ్ ఈర్ల చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి లింగయ్య, జీపీఓ రహీమ్ పాషా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రానికి ఎల్దీ శంకర్ సహాయం

**భైంసా, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని మహాగం గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి గ్రామ యువ నాయకుడు ఎల్దీ శంకర్ తన వంతు సాయం అందించారు. ఈ కేంద్రాల్లో గత కొంతకాలంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పాటు ఫ్యాన్లు లేక సిబ్బంది, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఎల్దీ శంకర్ వెంటనే స్పందించి, తన సొంత ఖర్చుతో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు ఫ్యాన్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అప్పాల రాజ్యలక్ష్మి రాకేష్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో యువకులు భాగస్వాములు కావాలని, శంకర్ చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని ఎల్దీ శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**సారంగాపూర్, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని కంకేట గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి డాక్టర్ నందకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నందకుమార్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల వల్ల పశువులకు సోకే గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ముందస్తు టీకాలు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామంలోని ప్రతి రైతు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే పశువుల ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాహెబ్ రావు, పశువైద్య సిబ్బంది సాగర్, భోజన్న, పోతన్న, రైతులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న డాక్టర్ నందకుమార్

# ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**





**నస్పూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓల తో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఓటర్ల మ్యాపింగ్, బూత్ స్థాయి అధికారుల శిక్షణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలని, బూత్ స్థాయి అధికారులు మ్యాపింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు శిక్షణ అందించాలని, బూత్ స్థాయి ఏజెంట్లకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు శిక్షణ సంబంధిత మెటీరియల్ అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల పోస్టులు ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులను నియమించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమ సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించడం జరిగిందని, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 63 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని, పోలింగ్ కేంద్రాల వారీగా కనీసము 50 శాతము మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సరిగా పనిచేయని బూత్ స్థాయి అధికారులను తొలగించడం జరిగిందని, వారి స్థానంలో కొత్త వారిని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి: అధ్యాపకుల పిలుపు

**సారంగాపూర్, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శనివారం మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గత 99 రోజులుగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులందరూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరాలని వారు కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కందూరు శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, మెరుగైన వసతులు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఈ విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా ప్రభుత్వం మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తోందని వివరించారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఇక్కడ విద్యాబోధన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అఖండ హరినామ సప్తాహంలో ఎమ్మెల్యే

**భైంసా, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**



భైంసా మండలంలోని దేగం గ్రామంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను, ప్రశాంతతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి విషయంలోనూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# టెండర్ ఆలస్యంపై కార్మికుల ఆందోళన

### కుటుంబాలను రోడ్డుపాలు చేయొద్దని హెచ్చరిక: ఎస్‌సీకేఎస్-సిఐటియు

**మందమర్రి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**



టెండర్ పేరుతో కార్మికుల కుటుంబాలను రోడ్డు పాలు చేసే చర్యలను సహించబోమని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఎస్‌సీకేఎస్-సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ హెచ్చరించారు. మందమర్రి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఎస్అండ్ పీసీ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు సంబంధించిన టెండర్ గడువు ముగిసి నెల రోజులు గడిచినా ఇప్పటికీ కొత్త టెండర్ పిలవకపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ టెండర్‌పై ఆధారపడి జీవిస్తున్న దాదాపు 220 కుటుంబాలు ఒక్కసారిగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడిన పరిస్థితి నెలకొందన్నారు. సమస్యపై అధికారులను పలుమార్లు కలిసినా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు న్యాయం చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతున్న కార్మికుల విషయంలో ఈ నిర్లక్ష్యం ఎందుకని, లేక ఉద్దేశపూర్వకంగా తొలగించేందుకే ఈ జాప్యం చేస్తున్నారా అనే అనుమానాలు కార్మికుల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. గత నెల రోజులుగా ఉపాధి లేక కార్మికులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఏరియా జీఎం స్పందించి వెంటనే కొత్త టెండర్ పిలిచి కార్మికులందరికీ తిరిగి డ్యూటీలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం ఈ నెల 6వ తేదీ సోమవారం నుంచి నిరసనలు, ఆందోళనలు చేపడతామని ప్రకటించారు. అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ, బాలసదనంలను తనిఖీ చేసిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు

**నిర్మల్, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**



రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రమీల అగర్వాల్ శనివారం నిర్మల్ జిల్లాలో పర్యటించారు. ముందుగా మామడ మండలంలోని జగదాంబ తండా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేసి, పిల్లల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు పోషకాహారాన్ని నిర్ణీత సమయానికి అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం కొండాపూర్‌లోని ప్రభుత్వ బాలసదనంను సందర్శించి, అక్కడ వసతి పొందుతున్న పిల్లలతో ముఖాముఖి మాట్లాడారు. వారికి అందుతున్న వసతులు, విద్యాబోధన తీరును పరిశీలించారు. పిల్లల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, వారికి ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, సీడబ్ల్యూసీ సభ్యురాలు శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి మురళి, బాలసదనం సూపరింటెండెంట్ వైష్ణవి, సూపర్వైజర్ రజిని తదితరులు పాల్గొన్నారు.



## నీటి సమస్యలు ఉంటే సంప్రదించండి

### - డి ఈ శ్రీనివాస్

**ఉట్నూర్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త**

ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని మోమిన్‌పుర వీధిలో మిషన్ భగీరథ నీటి సరఫరాను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ స్థానిక వార్డ్ మెంబర్ సౌకత్ అలీ తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీ ఈ శ్రీనివాస్ ప్రజల వద్దకు వెళ్లి రోజువారీగా నీటి సరఫరా సక్రమంగా అందుతున్నదా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా,నీటి సరఫరాలో అంతరాయం ఉన్నదా అనే అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే తనను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. నీటి సరఫరా సక్రమంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ సచిన్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

**నర్సాపూర్ (జి), ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**

మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధియే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని చాక్ పల్లి అనుబంధ గ్రామమైన పాత, కొత్త డొంగుర్గాం గ్రామాలలో వీఓ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో మహిళా సంఘాల బలోపేతానికి ఈ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా, హ్యామ్ నిధులతో అర్లి (కే) నుండి డొంగుర్గాం వరకు బీటీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మ్యాదరి సుధాకర్, ఉపసర్పంచ్ ప్రవీణ్ కుమార్, నాయకులు పిప్పెర వెంగళరావు, గోంద్ర సాగర్, సంతోష్, ఎంపీడీఓ పుష్పలత, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఎం గంగామణి, పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





సన్మానిస్తున్న సర్పంచ్ నామత్కర్ దిగంబర్

## ఆదర్శ ఉపాధ్యాయునికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

**భైంసా, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**

కుబీర్ మండలంలోని పాంగ్ర ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆదర్శ ఉపాధ్యాయుడు సాయికృష్ణ జన్మదిన వేడుకలను శనివారం గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నామత్కర్ దిగంబర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడిని ప్రత్యేకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సాయికృష్ణ తనదైన శైలిలో అత్యాధునిక పద్ధతుల్లో బోధిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల పేద విద్యార్థులు చదివే ఈ పాఠశాలలో పిల్లలు ఇంగ్లీష్, గణితం వంటి సబ్జెక్టుల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రావీణ్యం సంపాదించడం విశేషం. ఉపాధ్యాయుని కృషికి తోడుగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరో విద్యా వాలంటీర్‌ను కూడా నియమించారు. పాఠశాలలో అందుతున్న నాణ్యమైన విద్యను గమనించిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు బడులకు పంపకుండా స్థానిక పాఠశాలలోనే చదివించాలని నిర్ణయించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి, వసతుల కల్పనకు తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని సర్పంచ్, గ్రామ పెద్దలు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్

## కారోబారి రాజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించిన అధికారులు

**సారంగాపూర్, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని బిరవెల్లి గ్రామంలో కారోబారిగా విధులు నిర్వహిస్తున్న తాళ్ల రాజేశ్వర్ (45) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. శనివారం మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, డీఎల్‌పీఓలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజేశ్వర్ భార్య, కుమారుడు, కుమార్తెను కలిసి వారికి మనోధైర్యాన్ని చెబుతూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన రాజేశ్వర్ మృతి చెందడం బాధాకరమని అధికారులు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున, తమ వంతుగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బ్యాగారి గంగవ్వ చిన్నయ్య, గ్రామ పెద్దలు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**నిర్మల్, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**

నిర్మల్ నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తూ శనివారం భారీ సంఖ్యలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో మొత్తం 119 మంది లబ్ధిదారులకు రూ. 44 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందుతున్న ఈ సహాయం బాధితులకు గొప్ప ఆర్థిక భరోసాను కల్పిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. సహాయం అందుకున్న వారు ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## యువకుడిపై ఫోక్స్ కేసు నమోదు

**కెరమెరి ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**



మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ యువకుడిపై ఫోక్స్ కేసు నమోదు చేసి రీమాండ్ పంపించినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం రెబ్బెన మండలంలోని నార్ల పూర్ గ్రామానికి చెందిన సాయికృష్ణ గతకొన్ని రోజులుగా కెరమెరి మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక స్కూల్ వెళ్తుండగా వెంటపడటం తో పాటు ఫోన్ చేసి. లైంగిక వేధింపులకు గురి చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాయికృష్ణ పై ఫోక్స్ కేసు నమోదు చేసి. రీమాండ్ పంపించినట్లు పేర్కొన్నారు. ప్రేమ పేరుతో బాలికల వెంటపడి వేధింపులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆకతాయి లను ఎస్ఐ హెచ్చరించారు. అమ్మాయిలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే. నిర్భయంగా పోలిసులకు ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని చెప్పారు.



ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్ వనజ దంపతులు

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**తాండూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :**

పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాసిపేట సర్పంచ్ ముదం వనజ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని గ్రామంలో మొదటగా గృహ ప్రవేశం చేసిన సాత విజయ విశ్వనాథం దంపతులను శనివారం సర్పంచ్ ముదాం వనజ,గోవర్ధన్ దంపతులు ఘనంగా సన్మానించారు.

### ఈ నెల 13న రాజ్ గోండు

## సేవా సమితి రాయ్ దర్భార్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :**

గిరిజనుల ఆరాధ్య దైవం రాజ్ గోండు రాయి దర్బార్ కు హాజరు కావాలని ఆ సేవా సమితి సభ్యులు జిల్లా కలెక్టర్ హరితను ఆహ్వానించారు. శనివారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో గోండు రాజు సుర్పం మోకాసిల స్మారక జెండా పూజ, రాయ్ దర్బార్‌కు సంబందించిన కరపత్రాలను నాయకులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ సిర్పూర్ టి మండలం మేడి పల్లీ గ్రామములో స్మారక జెండా పూజ, రాయ్ దర్బార్ వున్నందున రాజ్ గోండ్ సేవాసమితి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో గ్రామ కమిటి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హరిత



రన్ ఫన్ జీసస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన దృశ్యం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

# ఘనంగా రన్ ఫర్ జీసస్

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 04, ప్రభాతవార్త**

ఏసుక్రీస్తు మానవాళి పాపాల నిమిత్తం సమాధిని గెలిచి తిరిగి మూడోరోజు మరణాన్ని జయించి లేచి లోకానికి శాంతి మార్గాన్ని చూపారని తెలుపుతూ శనివారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. ఈ సందర్భంగా బేతేల్ దర్శన ప్రార్థన మందిరం నుండి ప్రారంభమైన రన్ ఫర్ జిసెస్ ర్యాలీని పాస్టర్ డి. రత్నయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఉత్కూర్ చౌరస్తా మీదుగా బిట్ బజార్, పాత బస్టాండ్ సిఎస్ఐ చర్చి వరకు వచ్చి పాస్టర్ రెవరెండ్ డేవిడ్ పాల్ ప్రార్థన ఆశీర్వచనంతో ముగిసింది. రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న వారందరికీ తరల్ల విజాయ్ బృందం సిఎస్ఐ చర్చి ఆవరణలో టిఫిన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాస్టర్లు రవి జోసెఫ్, భాస్కర్, శాంసన్, కమలాకర్, శ్రీధర్, వివిధ చర్చి కమిటీ పెద్దలు, పెద్దవాళ్ళు, చిన్న పిల్లలు, తదితరులు బారి సంఖ్యలో పాల్గొన్నారు.

**ఉట్నూర్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త :**

ఉట్నూర్ డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్, ఉట్నూర్ డివిజన్ క్రిస్టియన్ అసోసియేషన్, ఉట్నూర్ డివిజన్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించరు.సెయింట్ పాల్స్ చర్చ్ నుండి ఎన్టీఆర్ చౌక్,అంబేద్కర్ చౌక్,జగజ్జీవన్ రావు చౌక్ , శివాజీ చౌక్, పాత బస్టాండ్, ఎమ్మార్వో ఆఫీస్, ఐటీడీఏ, రాంజీ గోల్డ్ చౌక్,మీదుగా సిఎస్ఐ చర్చి వరకు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు,క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షులు ,యూపీఏ యు సి ఏ యు సి వై ఏ కార్యదర్శులు రెవరెండ్స్ యూ.పీ.ఏ ప్రెసిడెంట్ రెవరెండ్ బి డానియల్, హెచ్ ఆర్. జోసఫ్, రెవరెండ్ జె.రత్నం, శామ్యూల్ రెవరెండ్ ఫాదర్ వినోద్, బి.ప్రశాంత్ కుమార్, పాస్టర్ సునీల్, పాస్టర్ దయాకర్, రేవంత్ కి. తిమోతి బాపురావు, పాస్టర్ శామ్యూల్,పాస్టర్ సతీష్,బ్రదర్ జార్జ్, బ్రదర్ శాంతికుమార్, బ్రదర్ శ్రీనివాస్, బ్రదర్ బి లాజర్, పాస్టర్ బి శ్యామ్ రిజయిస్ బ్రదర్ సంసన్, బ్రదర్ దివాకర్, రెవరెండ్ కే ఏలియా. తదితరులు పాల్గొన్నారు.



**బెల్లంపల్లి, ఏప్రిల్ 04, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గంలో ఆరాధన టీవీ ఛానల్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం రోజు అత్యంత భక్తి, ఉత్సాహ వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన సుమారు 50 చర్చిల పాస్టర్లు, విశ్వాసులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఆధ్యాత్మిక సందేశాలను ప్రజల్లో వ్యాప్తి చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం, యేసుక్రీస్తు గుడ్ ఫ్రైడే రోజు సిలువపై మరణించి మానవాళి పాప విమోచన కోసం తన ప్రాణాలను అర్పించిన త్యాగాన్ని స్మరించుకోవడం. అలాగే, మూడవ దినం ఆయన మరణాన్ని జయించి తిరిగి లేచిన పునరుత్థాన సందేశాన్ని ప్రజలకు తెలియజేయడం ద్వారా విశ్వాసాన్ని బలపరచడం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. యేసుక్రీస్తు కోసం పరిగెత్తడం అంటే ఆయన ప్రేమ, శాంతి, క్షమ, సేవ వంటి విలువలను మన జీవితాల్లో ఆచరించడం అనే సందేశాన్ని ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు చేరవేశారు. ర్యాలీ ఉదయం రోమన్ క్యాథలిక్ చర్చి ప్రాంగణంలో ప్రార్థనలతో ప్రారంభమైంది. అనంతరం కాల్ టెక్స్, అశోక్ నగర్, రాం నగర్, తిలక్ స్టేడియం మార్గంగా సాగి, సిఎస్ఐ చర్చి ప్రాంగణంలో ముగిసింది. మార్గమధ్యంలో పాల్గొన్నవారు భజనలు, ప్రార్థనలు చేస్తూ, శాంతి సందేశాలతో కూడిన పలకలు ప్రదర్శిస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించారు. ర్యాలీ సాగిన మార్గాల్లో స్థానిక ప్రజలు కూడా ఆసక్తిగా వీక్షిస్తూ పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు హాజరై ర్యాలీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదం చేస్తాయని, శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఆరాధన టీవీ ఛానల్ ప్రతినిధులకు, వివిధ చర్చిల పాస్టర్లకు, పాల్గొన్న విశ్వాసులకు సిఎస్ఐ చర్చి ప్రెసిబిటర్ ఇన్‌చార్జ్ రెవరెండ్ సిహెచ్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ యేసు క్రీస్తు బోధనలు మన జీవితాలను మార్గదర్శనం చేస్తాయని, ప్రతి ఒక్కరూ ప్రేమ, సేవ, క్షమ అనే విలువలను పాటించాలని కోరారు.

# హైకోర్టు తీర్పుతో పేద విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 04, ప్రభాతవార్త**

అచల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్డీఎస్) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ సబ్బని రాజేంద్ర ప్రసాద్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు బకాయిలపై హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు సరైనది కాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై హామీలు ఇచ్చి విద్యార్థులను కళాశాలల్లో చేర్పించిందని, అలాంటప్పుడు ఫీజులు ముందుగా విద్యార్థుల నుంచే వసూలు చేసి, తర్వాత ప్రభుత్వం చెల్లించాలనే తీర్పు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని తెలిపారు. ఈ తీర్పు విద్యార్థుల విద్యాభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, వీరిలో ఎక్కువ మంది పేద వర్గాలకు చెందిన వారేనని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఫీజులు చెల్లించలేక వారు చదువులు మానేసే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రైవేట్ కళాశాలలు ఫీజు బకాయిల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. గతంలో ఇలాంటి పరిస్థితుల వల్ల విద్యార్థులు తీవ్ర నిరాశకు గురైన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే హైకోర్టు తీర్పును పునః సమీక్షించి, ప్రభుత్వం తక్షణమే ఫీజులు విడుదల చేయాలని ఆదేశాలు ఇవ్వాలని కోరారు.



# ప్రశాంతంగా, పారదర్శకంగా క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక

### - చైర్ పర్సన్ డాక్టర్ గోడిశెల సంధ్యా రాణి - వైస్ చైర్ పర్సన్‌మిట్టపల్లి సరిత

### - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య

**క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**




మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల పరోక్ష ఎన్నికలు నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ఎన్నిక కార్యక్రమానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించగా, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోన్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్‌గా గొడిసెల సంధ్యారాణి (17వ వార్డ్), వైస్ చైర్ పర్సన్‌గా మిట్టపెల్లి సరిత (22వ వార్డు)లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి 11న క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ఎన్నికలు జరుగగా, ఫిబ్రవరి 13 న ఎన్నికల ఫలితాలు వెలువడగా బిఆర్‌ఎస్ పార్టీకి 10 సీట్లు, కాంగ్రెస్ పార్టీకి 07 సీట్లు, సీపిఐ పార్టీకి 04 సీట్లు, ఒక్క స్థానం లో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఫిబ్రవరి 16న కౌన్సిలర్‌ల ప్రమాణ స్వీకారం, చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక వాయిదా పడి, మరుసటి రోజు ఫిబ్రవరి 17న నిర్వహించాల్సిన ఎన్నిక సైతం వాయిదా పడిందని, హైకోర్టు, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల తో ఎన్నిక సజావుగా నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలో బిఎన్‌ఎస్ 163 అమలు చేసి, సుమారు 650 మంది పోలీసు బందోబస్తు నడుమ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్‌ల నుండి సంతకాలు సేకరిస్తున్న అధికారులు

## విద్యార్థుల ఆరోగ్యం స్థిమితంగా ఉంది

### - జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :**

అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం స్థిమితంగా ఉందని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పెంచికలపేట మండలం ఎల్లూర్ గ్రామంలోని బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 161 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 138 మంది విద్య అభ్యసిస్తున్నారని, వీరిలో 10వ తరగతికి చెందిన ముగ్గురు, 9వ తరగతికి చెందిన ఒక్కరు, 7వ తరగతికి చెందిన ఒక్కరు ఈ నెల 2వ తేదీన రాత్రి భోజనం అయిన తర్వాత 3వ తేదీ ఉదయం వాంతులు, డయేరియాకు గురయ్యారని తెలిపారు. ఆరోగ్య కార్యకర్త వీరిని తక్షణమే పెంచికలపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలు నిమిత్తం అంబులెన్స్ లో కాగజ్ నగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడం జరిగిందని, ఆరోగ్య కార్యకర్త, ఉపాధ్యాయులు విద్యార్థులతో ఉన్నారని తెలిపారు. ఆసుపత్రిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై వైద్యులను సంప్రదించగా విద్యార్థుల ఆరోగ్యం స్థిమితంగా ఉందని, రాత్రి సమయంలో ఆలస్యంగా భోజనం చేయడం వలన వారు తీసుకున్న ఆహారం జీర్ణం కాలేదని, అందువలన అస్వస్థకు గురయ్యారని, ఈ నెల 4వ తేదీన విద్యార్థులను డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని తెలిపారని వివరించారు. పాఠశాలలోని మిగిలిన 133 మంది విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు.



బోరింగ్‌కు మోటార్ బిగిస్తున్న దృశ్యం

## బోరింగ్‌లకు మోటార్లు ఏర్పాటు

**తాండూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :**

తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల అశోక్ నగర్, మేదరి వాడ, కొత్త గుడిసెలలో బోర్లు వేయించి శనివారం మోటర్లు బిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముడిమడుగుల సురేష్ మాట్లాడుతూ కాలనీలో మంచినీటి కొడత లేకుండా బోర్లు వేయించి మోటర్లు బిగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, ఉప సర్పంచ్ సత్యం, వార్డు సభ్యులు పట్టం విష్ణు కళ్యాణ్, పురంశెట్టి అరుణ్, నాయకులు శంకర్, నియాజ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## నేరడిగొండలో ఉచిత వైద్య శిబిరం

### - అవగాహన కల్పించిన వైద్యులు

**నేరడిగొండ, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**



నెరడిగొండ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సద్దాం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వివిధ ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎన్సీడీ స్క్రీనింగ్, ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్షయ వ్యాధి లక్షణాలపై ప్రజలకు వివరించారు. గర్భిణులు సురక్షిత ప్రసవాల కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని, ఆసుపత్రి ప్రసవాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ రవీందర్, హెల్త్ సూపర్వైజర్లు సంతోశ్, శ్రీనివాస్ రెడ్డి, ఆశా కార్యకర్తలు జయమ్మ, గీత, రజిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వేరు వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

**వేమనపల్లి, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**



మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని శనివారం వేరువేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వేమనపల్లి గ్రామానికి చెందిన చల్ల కుమార్ తన తల్లి లచ్చక్కను ద్విచక్ర వాహనంపై చెన్నూరుకు వెళ్తున్న క్రమంలో కొత్తగూడెం సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో చల్ల కుమార్ కు ఒక కాలు, చేయి ఇరుగగా తల్లికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే నీల్వాయి చర్చి సమీపంలో జరిగిన ప్రమాదంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముల్కలపేటకు చెందిన డోలే అశోక్ కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే నీల్వాయికి చెందిన దిలీప్ రెడ్డి తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అశోక్ ను మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇట్టి సంఘటన స్థలాలను నీల్వాయి పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గిరిజనుల జీవన స్థితిగతులను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్ల బృందం

**ఉట్నూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

గిరిజన గ్రామాలలో పర్యటించి గిరిజనుల జీవన స్థితిగతులను డిప్యూటీ కలెక్టర్ల బృందం పరిశీలించారు. శనివారం పి.ఎం.ఆర్.సి.లో టి.పి.సి.సి. ప్రతినిధి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను బృంద సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం ఉట్నూర్ మండలంలోని మారుమూల ప్రాంతాలైన కామాయిపేట గ్రామంలో పర్యటించారు. కొలాం గిరిజనులతో మాట్లాడి త్రాగునీరు, విద్యుత్తు, వర్షాకాలంలో ఎదుర్కొనే రవాణా సౌకర్యాలతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి జన్ మన్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా గిరిజనులకు అందుతున్న లబ్ధి వివరాలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు, రోడ్లు సరిగ్గా లేకపోవడంతో వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు బృంద సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. గిరిజన విద్యార్థులను చక్కగా బాగా చదివించాలని, గిరిజన గ్రామాలలో గ్రామ సభలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యం, విద్య, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్ల సౌకర్యం లేని గ్రామాలను గుర్తించి రోడ్డు సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని గ్రామ పెద్దలకు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలు, పంచాయతీ భవనాలు, పాఠశాలలు పరిసరాల శుభ్రతను పరిశీలించారు. పి వి టి జి కొలం గిరిజనులలో ప్రాథమిక విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. అనంతరం గిరిజనుల ఆరధ్య దైవమైన కేస్లాపూర్ నాగోబా దేవతను దర్శించుకున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో బాలికలకు రక్తహీనతను తగ్గించిన పోషక విలువ గల మోవలడ్డు ఆదివాసి ఆహారం పరిశ్రమను సందర్శించి, మోవలడ్డు రుచి చేసి చాలా బాగుందని నిర్వాహకులను అభినందించి, కొనుగోలు చేశారు.



## కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**కెరమెరి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని తైసిల్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 124 మంది లబ్దిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సంతోష్ కుమార్, మాజీ జెడ్పిటిసి దురుపతబాయి, మాజీ వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం, కెరమెరి సర్పంచ్ పేందూరు ఆనందరావు, టిఆర్ఎస్ నాయకులు ఎస్.కె యూనూస్, నిసార్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణి చేస్తున్న తహసీల్దార్ సంతోష్ కుమార్



లబ్ధిదారుడుకి చెక్కు పంపిణి చేస్తున్న దృశ్యం

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :**

సిర్పూర్ శాసనసభ్యులు గౌరవనీయులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆదేశానుసారం శనివారం లబ్ది దారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షులు కె.శివకుమార్ రిటైర్డ్ ఆర్మీ చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని ఎన్‌జీఓఎస్ కాలని, గాంధీ నగర్,కాపువాడ, సర్దార్ బస్తి, స్టేషన్ రోడ్, ఏరియాల్లో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజనేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దెబ్బటి శ్రీను, పరికీపల్లి రాణి, కొప్పుల సుధాకర్, కనకయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలీసుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

**కెరమెరి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**

నేడు మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్లో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్ ఐ ఎన్ మధుకర్ తెలిపారు. అన్ని పరీక్షలతో సహా మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల వాయిదాపై కలెక్టర్‌కు వినతి

### - అధికార దుర్వినియోగంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి - బీఆర్ఎస్, బీజేపీ నేతలు

**ఖానాపూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**

ఖానాపూర్ మున్సిపాలిటీలో నిర్వహించాల్సిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను వాయిదా వేయడాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ, స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ ఎన్నికలను ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు.ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకున్న అధికారులతో పాటు దీనికి కారణమైన ప్రజాప్రతినిధులపై తక్షణ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నేడు జరగనున్న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు లేకుండా పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మీ సేవ కేంద్రం తనిఖీ

**వేమనపల్లి, ఏప్రిల్ 04, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వం మీసేవ కేంద్రాల సర్వీస్‌ల ధరలు అమాంతం పెంచడంతో వేమనపల్లి మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాన్ని ఆర్ఐ ఖాలిక్ శనివారం తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన సేవల ధరల పట్టికను పరిశీలించి, నిబంధనల మేరకు రుసుములు వసూలు చేస్తున్నారా అని ఆరా తీశారు. ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ధరల పట్టికను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు.



ధరల పట్టికను పరిశీలిస్తున్న ఆర్ఐ

# ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి

### - రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తహసిల్దార్లు, సూపర్ వైజర్లు, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తి చేయాలని, బూత్ స్థాయి అధికారుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, వారికి గుర్తింపు కార్డులు అందజేయాలని తెలిపారు. ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 678 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక బూత్ స్థాయి అధికారిని నియమించడం జరిగిందని, బూత్ స్థాయి అధికారులకు, సూపర్ వైజర్లకు ఇప్పటికే శిక్షణ ఇవ్వడం జరిగిందని, వారికి గుర్తింపు కార్డులు అందజేశామని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుండి తీసుకుంటున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించడం జరిగిందని, ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





సోలార్ లైట్ ప్రారంభిస్తున్న నాయకులు

## సోలార్ లైట్ ఏర్పాటు

**వేమనపల్లి, ఏప్రిల్ 04, ప్రభాతవార్త**

మండలంలోని ముల్కలపేట గ్రామంలో శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ జెడ్పీటిసి ఆర్. సంతోష్ కుమార్ సహకారంతో రూ.2 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఎస్సీ కాలనీలో సోలార్ లైట్ ఏర్పాటు చేసి మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కామెర గణేష్, ఎడ్ల మహేష్, నాయకులు ఎల్కరి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## షాలోమ్ పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్

**మందమర్రి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

మందమర్రి షాలోమ్ పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక దొర్ల బంగ్లా ఆవరణం నుండి ప్రారంభమై పట్టణంలో పలు విధులలో సాగుతూ పాత బస్టాండ్ వద్ద గల ఫ్లైఓవర్ బ్రిడ్జి నందు ముగించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు ఏలీయా మాట్లాడుతూ... పట్టణంలోని క్రైస్తవులు, పాస్టర్‌ల ఆధ్వర్యంలో ఈ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించామన్నారు. క్రీస్తు ప్రపంచ మానవాళి కొరకు సిలువలో ప్రాణం విడిచి తిరిగి మృత్యుంజయుడై లేచాడని తెలియజేయుటకు,సమాజ ఐక్యతను తెలియజేయుటకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ దైవజనులు జాన్ ప్రసాద్,ఆనంద్, విజయ్, జూపక సాల్మోన్, జెర్మియా, ఉపేందర్ సాల్మోన్‌లు పాల్గొన్నారు.






## అసంక్రమణ వ్యాధులపై అవగాహన శిబిరం

### - గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు చర్యలు

**మందమర్రి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మందమర్రి మండలం కోటేశ్వరపల్లి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అసంక్రమణ వ్యాధులపై ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సేవలు అందిస్తూ, శిబిరం మరియు ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో డాక్టర్ విష్ణు తేజ, సిహెచ్ వెంకటేశ్వర్లు, లక్ష్మణస్వామి, సిహెచ్ విజయలక్ష్మి, మంజుల తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా జీవనశైలిలో మార్పుల వల్ల వచ్చే అసంక్రమణ వ్యాధులు అయిన బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులను తొందరగా గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, మందులు అందించడం మరియు ప్రజల్లో అవగాహన కల్పించడం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే జాతీయ క్షయ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అనుమానిత రోగులను గుర్తించి, తుమ్ము పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించడం జరుగుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, ఇందుకోసం స్థానిక ఎన్జీవోల సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇంట్లో లభించే పౌష్టికాహారాన్ని వినియోగించాలని ప్రజలను కోరారు. ఇటీవల పెరుగుతున్న ఎండల దృష్ట్యా వడదెబ్బపై కూడా అవగాహన కల్పించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా చెమటలు పట్టకపోవడం, అధిక దాహం, తల తిరగడం, అపస్మారక స్థితి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యక్తిని నీడలోకి తీసుకెళ్లి, చల్లటి నీటితో శరీరాన్ని చల్లబరచి, ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని సూచించారు. అవసరమైతే 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. వడదెబ్బ నివారణకు రోజుకు కనీసం 10 గ్లాసుల కంటే ఎక్కువ నీరు తాగడం, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీ ఉపయోగించడం, లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం, ప్రత్యక్ష సూర్యరశ్మికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

# ఆసుపత్రి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

**- సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు**



ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లలగౌడ్ తోటలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఏరియా ఆసుపత్రి నూతన భవన పనులను శనివారం సిర్పూర్ శాసన సభ్యుడు పాల్వాయి హరీష్‌బాబు పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకొని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలని సైట్ ఇంజనీర్‌కు సూచించారు. ఈ సందర్భంగా పెంచికల్పేట్ మండలం ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో ఇటీవల ఫుడ్ పాయిజనింగ్ కారణంగా అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రి సిబ్బంది మరియు వైద్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగజ్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తన కృషితో కొత్త ఎక్స్‌రే యంత్రం మంజూరు అయ్యిందని, అదనపు వైద్య సదుపాయాల కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.అంతేకాకుండా, ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సేవలను విరివిగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా. అవినాష్, డా. విజయ్, డా. మహేష్, డా. అరుణ్, డయాలసిస్ టెక్నీషియన్ శివ, ఆయుష్మాన్ భారత్ ఇంచార్జి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ డీసీసీ కార్యవర్గ సమావేశం

**- రాబోయే ఎన్నికల్లో బీజేపీకి పరాభవం ఖాయం - టిపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

ఆదిలాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదని అన్నారు.రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని బీజేపీ ఎమ్మెల్యేలు గెలవడం అసాధ్యమని, ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ కాలంలో దొడ్డు బియ్యాన్ని అమ్ముకొని అక్రమంగా లాభాలు పొందారని ఆరోపించారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యాన్ని ఎక్కడా పక్కదారి పట్టకుండా నేరుగా బీదల ఇళ్లకు చేరేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నదని చెప్పారు.రేపు వీచే కాంగ్రెస్ గాలిలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, హరీష్ బాబు తుఫానులో కొట్టుకుపోతారని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.ఉట్నూర్ ఐటిడిఎ కార్యాలయాన్ని సందర్శించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న డిప్యూటీ కలెక్టర్లతో మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షులు ఐటిడిఎ పనితీరును, సౌకర్యాలను అడిగి తెలుసుకుని ఐటిడిఎ కు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

# ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా

**- సమాన మద్దతుతో ప్రతిష్టంభన - బీజేపీ, బీఆర్ఎస్ ఆందోళన**

ఖానాపూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

ఖానాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. శనివారం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, అభ్యర్థులకు సమాన మద్దతు లభించడం వల్ల పరిస్థితి ప్రతిష్టంభనకు దారితీసింది.ఈరోజు నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు బీజేపీకి చెందిన నలుగురు, బీఆర్ఎస్ ముగ్గురు కౌన్సిలర్లు, ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, ఒక స్వతంత్ర అభ్యర్థి, అలాగే ఇటీవల కిడ్నాప్‌కు గురైన బీఆర్ఎస్ కౌన్సిలర్ హాజరయ్యారు.ఈ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ కూటమిగా ఏర్పడి బీజేపీ అభ్యర్థి అంకం మోనికను చైర్పర్సన్ అభ్యర్థిగా ప్రకటించారు. ఆమెకు మొత్తం ఏడుగురు కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి చిన్నం సత్యంకు కూడా ఏడుగురు కౌన్సిలర్ల మద్దతు లభించింది.అయితే చిన్నం సత్యంను చైర్మన్‌గా ప్రకటించాలని ఎమ్మెల్యే పట్టుబడడంతో ఎన్నికల ప్రక్రియలో గందరగోళం నెలకొంది. దీంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేయాల్సి వచ్చింది.ఎన్నిక వాయిదా పడటంతో కాంగ్రెస్ అభ్యర్థులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో స్వల్ప ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఆందోళన కారులపై పోలీసులు స్వల్పంగా లాటి చార్జ్ చేయడం జరిగింది.






నివాళులు అర్పిస్తున్న మాజీ ఆర్మీ జవాన్ దంపతులు

## ఘనంగా వీరనారి ఝుల్కారిబాయి వర్ధంతి

మందమర్రి, ఏప్రిల్4, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుత ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పిప్ హాల్, రాణి పిప్ హాల్ నివాసంలో వీరనారి ఝుల్కారిబాయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఝాన్సీ సమీపంలోని భోజ్‌లా గ్రామంలో సదోవర్ సింగ్, జమునాదేవి దంపతులకు వ్యవసాయకూలీ కుటుంబంలో 1830 నవంబర్ 22న ఝుల్కారిబాయి జన్మించిందని తెలిపారు. చిన్న వయసులోనే తల్లి మరణించడంతో తండ్రి పెంపకంలో గుర్రపుస్వారీ, కత్తిసాము వంటి యుద్ధ విద్యలను అభ్యసించిందన్నారు. అడవిలో పశువులను మేపుతున్న సమయంలో ఝుల్కారిపై దాడి చేసిన చిరుత పులిని కేవలం చేతికర్రతోనే చాకచక్యంగా హతమార్చిన ధైర్యసాహసాలు ఆమెకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయని వివరించారు. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలో ఆయుధ విభాగంలో పనిచేస్తున్న పూరణ్‌సింగ్‌ను వివాహం చేసుకున్న ఝుల్కారిబాయి, తరువాత లక్ష్మీబాయికి సన్నిహితమై సైన్యంలో చేరి దుర్గావాహిని మహిళా సాయుధ దళానికి నాయకత్వం వహించిందని పేర్కొన్నారు. సిపాయి తిరుగుబాటు సమయంలో శత్రుసేనలతో జరిగిన యుద్ధంలో ఆమె కీలక పాత్ర పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. 1858 ఏప్రిల్ 3న బ్రిటిష్ జనరల్ హగ్ రోజ్ నాయకత్వంలో ఝాన్సీ రాజ్యాన్ని బ్రిటిష్ సేనలు చుట్టుముట్టినప్పుడు, లక్ష్మీబాయి సురక్షితంగా బయటపడేందుకు ఝుల్కారిబాయి తానే లక్ష్మీబాయిగా మారి కోట ముందుకు వెళ్లి శత్రుసేనలను మోసం చేసి సమర్థంగా ఎదిరించిందని తెలిపారు. ఆ ఘటనలో ఆమెను బందీగా పట్టుకున్న బ్రిటిష్ సేనలు తరువాత గుర్తించి హతమార్చి ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. ఆమె స్మారకార్థం భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంపును విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పాఠశాల ఉపాధ్యాయులు ఓ. రవీందర్, టీ. దయాకర్ పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి: గుమ్ముల శ్రీనివాస్

**- జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఏకారి లిఖిత**

**తల్లిదండ్రులకు ఘన సన్మానం**

నస్పూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

తల్లిదండ్రుల కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ పేర్కొన్నారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్ అరుణక్కనగర్‌కు చెందిన ఏకారి లిఖిత జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా శనివారం ఆమె తల్లిదండ్రులు వెంకటేష్, లక్ష్మిలను సమితి నాయకులు ఘనంగా సత్కరించారు. సిసిసి కార్నర్ ప్రాంతంలో రోడ్డుపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబం తమ బిడ్డను ఉన్నత స్థాయికి చేర్చడం అభినందనీయమని కొనియాడారు. ఎన్ని కష్టాలు ఉన్నా పిల్లలను తీర్చిదిద్దడంలో అహర్నిశలు కృషి చేసిన ఈ తల్లిదండ్రులను నేటి సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలి. తల్లిదండ్రుల శ్రమను కళ్లారా చూసిన లిఖిత పట్టుదలతో చదివి జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగాన్ని సాధించింది. నేటి యువత లిఖితను ఆదర్శంగా తీసుకోవాలి. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉన్నత విద్యను అభ్యసించాలి. సొంతంగా ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్యాన్ని ముద్దాడాలని సూచించారు. యువతకు మార్గదర్శకంగా నిలిచిన లిఖితను సమితి ప్రతినిధులు అభినందించారు. లిఖిత సాధించిన ఈ విజయం జిల్లాలోని బీసీ సామాజిక వర్గ విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక వేముల, మంచర్ల సదానందం, పంపరి వేణుగోపాల్, చంద్రగిరి చంద్రమోళి, రాజు పాల్గొన్నారు.

